క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఎంపీ పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: జేఎన్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని మంగళవారం కలెక్టర్ కె.మాధవీలత మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీతో చర్చించారు.

కుట్టు, మగ్గం శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మగ్గం, టైలరింగ్ కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. శిక్షణ తరగతులు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయన్నారు. 45 రోజుల పాటు జరిగే శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందించడంతో పాటు శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి కలవారు 98498 47489, 94907 10850 నంబర్లను సంప్రదించాలన్నారు. లేకపోతే లాలా చెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు.

అవకాశం కల్పించండి

కడియం: గత ప్రభుత్వంలో తాము వలంటీర్లుగా సేవలందించామని, ఈ ప్రభుత్వంలో కూడా తమకు అవకాశం ఇవ్వాలని మంగళవారం పలువురు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థుల ర్యాలీ



కడియంలో ర్యాలీ చేస్తున్న హైస్కూల్ విద్యార్థులు

కడియం: ఏపీ సర్వశిక్ష ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కడియంలోని హైస్కూలు విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని హెచ్ఎం టి.సత్యనారాయణ ప్రారంభించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, విద్యార్థులతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరిగారు. బడికి పోదాం– భవితను మార్చుకుందాం, ఆడ మగ తేడా వద్దు – చదివే అందరికీ ముద్దు, బడిలోనే – రక్షణ, బడిలోనే భవిష్యత్తు అని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సువర్ణవేణి, గిరిజ, వీరబాబు పాల్గొన్నారు.

గోదావరిలో మహిళ మృతదేహం



కంబాలచెరువు: గోదావరిలో గుర్తుతెలియని మహిళ (40) మృతదేహాన్ని ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం గుర్తించారు. గౌతమీ జీవకారుణ్య సంఘం ఎదురుగా ఉన్న ఇసుక ర్యాంపు దగ్గరకు మృతదేహం కొట్టుకు వచ్చింది. దీన్ని చూసిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొమ్మూరులో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేలోపు ఇంటిలో దొంగలు పడి దోచుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కిల్లాడి సన్యాసి నాయుడు బొమ్మూరు జీపీఆర్‌ రోడ్డులో ఆర్కే లేఅవుట్‌లో భార్యాపిల్లలతో అద్దెకు ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం 4.30 గంటల సమయంలో భార్య, పిల్లలను తీసుకుని తాడితోటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి రాత్రి 9 గంటలకు ఇంటికి వచ్చారు. తలుపు తీసి లోపలికి వచ్చేసరికి వెనుక వైపు తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా బెడ్ రూమ్‌లోని బీరువా తాళాన్ని పగలగొట్టి ఉంది. అందులోని 90 గ్రాముల బంగారు వస్తువులు, అర కేజీ వెండి వస్తువులు, కొంత నగదు మాయమైంది. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీమ్ పరిశీలించి వేలిముద్రలను సేకరించింది. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారుఎల

వివాహిత అదృశ్యం

రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడేనికి చెందిన గల్లా భవాని (48) అనే వివాహిత ఇంటి నుంచి అదృశ్యమైంది. ఇటీవల ఆమె తోటి కోడలు మృతి చెందింది. అప్పటి నుంచి మానసిక వేదనతో భయంగా ప్రవర్తించేది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ మేరకు ఆమె అల్లుడు భూషంశెట్టి వీరన్న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి నుంచి వెళ్లే క్రమంలో మంగళ సూత్రాలు, చెవి రింగులు తీసి ఇంటిలో బల్లపైనే వదిలేసింది. ఆచూకీ కోసం అన్నిచోట్లా గాలించి, చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపారు.

నీటి వృథా.. ఆగేదెలా..

- పైపులైన్ల లీకేజీలతో అవస్థలు
- వృథాగా పోతున్న సురక్షిత నీరు
- పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: సురక్షిత తాగునీరు ప్రజలందరికీ సక్రమంగా అందాలంటే పైపులైన్లు బాగుండడం ఎంతో కీలకం. అవి సక్రమంగా ఉన్నప్పుడే నీరు అందరికీ అందుతుంది. అయితే పైపులైన్ల లీకేజీల కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. వేసవి నేపథ్యంలో నీటిని చాలా పొదుపుగా వాడుకోవడం అవసరం. కానీ లీకేజీల కారణంగా నీరంతా వృథాగా పోతోంది. సుమారు నెల రోజుల నుంచీ ఈ సమస్య ఉన్నా అధికారులు స్పందించడం లేదు.

పలుచోట్ల లీకేజీలు

బొమ్మూరు వెంకటగిరికొండపై 22 ఎంఎల్‌డీ దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సురక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు. దీని ద్వారా కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం మండలాలలోని గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఇటీవల ఈ పథకం పైపులైన్లకు పలుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో నీరంతా నేలపాలవుతోంది.

● బొమ్మూరులోని శృతి హాస్పిటల్ వద్ద మంచినీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి దాదాపు రెండు నెలలైంది. దానికి ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. ప్రతి రోజూ బొమ్మూరు గ్రామ పంచాయతీ సిబ్బంది గోతులోని నీటిని తోడాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా భారీగా వర్షం కురిస్తే ఆ ప్రాంతం మునిగిపోతుంది. అప్పుడు నీరు రోడ్డుపైకి చేరితే, వాహన చోదకులు ఆ గొయ్యిలో పడే ప్రమాదం ఉంది.



బొమ్మూరు శృతి హాస్పిటల్ వద్ద పైపులైన్ మరమ్మతుల కోసం తీసిన గొయ్యి

● హుకుంపేట జాతీయ రహదారి పక్కన చెరుకూరి గోడౌన్స్ వద్ద పైపులైన్ లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆ ప్రాంతం బురదమయంగా మారింది. ప్రతి రోజు మంచినీరు వదిలే సమయంలో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.



హుకుంపేట చెరుకూరి గోడౌన్స్ వద్ద పైపులైను లీకేజీతో పైకి వచ్చిన నీరు



బొమ్మూరు ఎంఆర్‌టీ వద్ద పనిచేయని మంచినీటి వాల్వ్

● బొమ్మూరు వెంకటగిరి కొండ సమీపంలోని ఎంఆర్‌టీ ఆఫీసు వద్ద తాగునీటి వాల్వ్ సరిగ్గా పనిచేయడం లేదు. దీనివల్ల వాటర్ ట్యాంకుల వెళ్లే మంచినీరు వృథా అవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరిగేషన్ కాలువలోకి డ్రైనేజీ సిల్ట్ డంపింగ్ !

కడియం: జనావాసాల మధ్య మురుగుకాలువల నుంచి తీసిన సిల్ట్‌ను కడియపులంక పంచాయతీ పరిధిలోని ఇరిగేషన్ కాలువలో డంపింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ముంపు నివారణా జాగ్రత్త చర్యల్లో భాగంగా కడియపులంక పంచాయతీ పరిధిలోని కడియపులంక, బుర్రిలంక గ్రామాల్లోని మురుగు కాలువల్లో సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. తీసిన సిల్ట్‌ను డంపింగ్ యార్డులకు తరలించాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా కోటిపల్లి సాగునీటి కాలువ వెంబడి పోస్తున్నారు. దీంతో సాగునీటిలో సిల్ట్ కలిసిపోవడంతో పశువులు సైతం ఆ నీటిని తాగడం లేదని తెలిపారు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పాఠశాల, కళాశాల విద్య అభ్యసిస్తున్న పాత్రికేయుల పిల్లలకు మంగళవారం నోట్ పుస్తకాలు అందజేసినట్టు అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, గౌరవ అధ్యక్షుడు మండెల శ్రీరామ్మూర్తి తెలిపారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారుకూడా జాబితా అందిస్తే నోట్ పుస్తకాలు ప్రెస్ క్లబ్ ద్వారా అందిస్తామని తెలిపారు.

నగరంలో పచ్చదనాన్ని పెంచాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పచ్చదనాన్ని పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన మంగళవారం నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. దీనిలో భాగంగా నగరంలో విస్తృతంగా పర్యటించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన రోడ్లలో డివైడర్ల అన్నింటిలోనూ మొక్కలు నాటామన్నారు. వాటిని పరిరక్షించడం ద్వారా నగరంలో పచ్చదనం పెరుగుతుందన్నారు. త్వరలో వర్షాలు కురవనున్న నేపథ్యంలో మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కాలువలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలించి పూడిక తీసివేయాలన్నారు. తీసిన సిల్ట్‌ను వెంటనే తరలించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఏడీహెచ్ కె.స్వాతి, శానిటరీ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో బంగారం, నగదు చోరీ

రాజానగరం: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో చోరీలు పెరిగిపోతున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. వైఎస్సార్ జంక్షన్‌లోని కాలనీలో రెండు రోజుల క్రితం రెండు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. కాలనీలో నివాసం ఉంటున్న కె.కీర్తన ఇంటికి తాళం వేసుకుని పొరుగూరు వెళ్లింది. దొంగలు ఆదివారం రాత్రి ఆ ఇంటి తాళాన్ని పగలుకొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 60 గ్రాముల బంగారు నగలు, రూ. 26 వేలు అపహరించుకుపోయారు. అదే ప్రాంతంలో ఉంటున్న కె.రఘువంశరెడ్డి కూడా కుటుంబ సమేతంగా ఊరెళ్లాడు. అయితే స్థానికులు అతడికి ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని చెప్పడంతో హుటాహుటిన వచ్చాడు. దొంగలు ఆ ఇంటి తలుపులను పగులకొట్టి బీరువాలోని నాలుగు కాసులు బంగారు నగలు, వెండి పూజా సామగ్రి, రూ.50 వేలు దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు పక్కకు జరిపిన కారు

కారును పక్కకు తీశారు

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పంచాయతీ పరిధిలోని హండ్రెడ్ ఫీట్ రోడ్డు నుంచి ఎస్‌టీపీ రోడ్డును కలుపుతూ నిర్మించిన రహదారిపై కాలిపోయిన కారును బొమ్మూరు పోలీసులు మంగళవారం క్రేన్ సహాయంతో పక్కకు తీశారు. దీనిపై మంగళవారం 'సాక్షి' పత్రికలో ఈ కారు ఎవరిదో పేరుతో వార్త వచ్చింది. దీనిపై జిల్లా పోలీసు అధికారులు స్పందించారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది ఆ కారును పక్కకు తీయించారు. అయితే అది ఎవరిది అన్న విషయం తేలాల్సి ఉంది.

బడి ఈడు పిల్లలందరూ స్కూళ్లలో ఉండాలి

కంబాలచెరువు: బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అర్బన్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన నేను బడికి పోతా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యపై తమ ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఉందన్నారు. అనంతరం ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు నందం గనిరాజు సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి చదువు ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. ఆనంద్ రీజెన్సీ, వై.జంక్షన్, ఉమెన్స్ కాలేజీల మీదుగా తిరిగి ఎస్‌కేవీటీ స్కూల్‌కు ర్యాలీ చేరుకుంది. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, స్కూల్ హెచ్‌ఎం ఎంవీఎం.సుబ్రహ్మణ్యం, రమాదేవి పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మోటార్‌బైక్‌కు నిప్పు పెట్టి కాల్చేయడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కోరారు. మండలంలోని వేండ్ర గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ కోసూరి సతీష్ తన ఇంటి బయట నిలిపి ఉంచిన మోటార్ బైక్‌ను గుర్తు తెలియని దుండగులు పెట్రోలు పోసి కాల్చేశారు. సత్తి సూర్యనారాయణరెడ్డి వేండ్ర గ్రామంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించి కాలిపోయిన బైక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇలాంటి దౌర్జన్యాలు, దురాగతాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, వీరభద్రరావు, సాంబత్తుల చంటి పాల్గొన్నారు.



వేండ్రలో దుండగులు కాల్చేసిన మోటార్ బైక్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



వేండ్రలో దుండగులు పెట్రోలు పోసి కాల్చేసిన మోటార్ బైక్

సేంద్రియ ఆహార ఉత్పత్తులపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు రసాయన రహిత ఆహార పంటల ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న టీచర్ రమ్యసుధ

రంగంపేట: విద్యార్థులు రసాయన రహితంగా సేంద్రియ విధానంలో పండించిన ఆహార ఉత్పత్తులపై అవగాహన పెంచుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి సూచించారు. మంగళవారం పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ ఆధ్వర్యంలో ఎడాప్టివ్ సస్టైనబుల్ ఫుడ్ సిస్టం కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటి పెరటిలో, మెట్ట ప్రాంతంలో పండించే రాగులు, సజ్జలు, కొర్రలు, పల్లీలు, జొన్నలు వంటి వాటి ద్వారా ఐరన్, జింక్, మాంసకృత్తులు, పీచు పదార్థాలు లభిస్తాయన్నారు. అలాంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు వినియోగించుకోవడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించిన సైన్స్ టీచర్ రమ్య సుధను, వివిధ ఆహార పదార్థాలను తయారు చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. స్మాల్‌ప్లేట్ సిస్టంను అనుసరించడం ద్వారా ఫుడ్‌వేస్ట్‌ని తగ్గించవచ్చని, స్థానికంగా దొరికే సేంద్రియ ఎరువుల వినియోగం, వాటి ద్వారా పంటల ఉత్పత్తులు ఏ విధంగా పెంచవచ్చునో సైన్స్ టీచర్ రమ్యసుధ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, వెంకటలక్ష్మి, సుభద్ర, అనితరాణి, సత్య పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలను నిలువరించాలి

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మట్టి తవ్వకాలను నిలువరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ త్రివేణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజుబాబు మాట్లాడుతూ మండలంలో పెద్దాడ, పెదపూడి, కైకవోలు, శహపురం గ్రామాల్లో నేషనల్ ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. అలాగే మట్టి తరలిస్తున్న లారీలు, ట్రాక్టర్లపై పరిమితికి మించి మట్టి వేయడంతో అది రోడ్డుపై పడి వర్షం కురిసిన సమయంలో బురదగా మారుతుందన్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఆర్ఐ త్రివేణికి వినతి పత్రం అందజేస్తున్న ఏపీఆర్‌సీఎస్ ప్రతినిధులు

నేడు మండల పరిషత్ సమావేశం

కడియం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో యావన్మంది ప్రాదేశిక సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

సాక్షి- సినిమాలు



శ్యామల :	హరోంహర
సూర్యమినీ :	చందు చాంపియన్
సూర్యప్యాలెస్ :	హరోంహర
స్వామి :	మహారాజ
శివజ్యోతి :	యేవమ్, సత్యభామ
అనుశ్రీ :	మనమే
రాజా :	బ్యాడ్ బాయ్స్
ఊర్వశి :	రాజధాని రౌడీ
రంభ :	ఇంద్రాణి
మేనక :	సత్యభామ
అప్సర :	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి:	మ్యూజిక్ షాప్ మూర్తి
నామవరం	
వీఎస్ మహల్ :	హరోంహర
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	మ్యూజిక్ షాప్ మూర్తి
కడియం	
వెంకట సూర్య :	హరోంహర

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ

రాజానగరం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతో పాటు చిన్నారులు పౌష్టికాహార లోపంతో బాధపడకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి పౌష్టికాహారం అందిస్తున్నాయి. దేశంలో అభివృద్ధి, ఉత్పాదకత, ఆర్థికాభివృద్ధి, జాతీయాభివృద్ధిపై ప్రజారోగ్యం ప్రభావం చూపుతుంది. దీనిని కాపాడుకోవడంలో పోషకాహారం ప్రాముఖ్యత ఎంతో ఉంది.

ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో..

ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) ప్రాజెక్టు ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలకు ఆయా కేంద్రాల వద్దనే సంపూర్ణ పోషకాహారం అందజేస్తున్నారు. కోడిగుడ్డు, 200 ఎంఎల్ పాలతో పాటు మెనూ ప్రకారం సంపూర్ణ పోషక విలువలతో కూడిన భోజనాన్ని రోజుకో రకమైన కూరతో తయారు చేసి అందజేస్తారు. అలాగే వేరుశెనగ, బెల్లం, సోడి పిండి, అటుకులు, గుళ్ల శెనగపప్పు, గోధుమలు మున్నగు వాటితో తయారుచేసిన పదార్థాల ప్యాక్‌లను కూడా సరఫరా చేస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న పిల్లలు (ఫైల్)

ముంగిట్లోనే పౌష్టికాహారం

మన ఇంటిలో లభించే పదార్థాలతో సంపూర్ణ పౌష్టికాహారాన్ని తయారు చేసుకోవచ్చని అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా అవగాహన కూడా కలిస్తున్నారు. జొన్నపిండితో లడ్డూలు, రాగి జావ, రాగి పిండితో జంతికలు, అటుకులతో పులిహోర, స్వీట్లు, బాలామృతంతో బిస్కెట్లను తయారు చేసుకోవచ్చు. వాటి తయారీ విధానాన్ని కూడా గర్భిణులు, బాలింతలకు వివరిస్తున్నారు. కరివేపాకు, ములగాకు, బొప్పాయి, జామ, వాటిలో ఉన్న పోషక విలువలు ఎక్కువగా ఉంటాయంటూ పౌష్టికాహార మాసోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.

> **రక్త హీనత నివారణ**
>
> 
>
> గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణకు సంపూర్ణ పోషకాహారాన్ని తీసుకోవడం ఎంతో అవసరం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సంపూర్ణ ఆహారం పథకాన్ని అమలు చేస్తోంది. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాజానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాలలో 304 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ పథకం కొనసాగుతోంది.
>
> – టి.నాగమణి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, రాజానగరం